

# శరశ్చంద్రికలు

శ్రీబాబూజీ సత్సంగాలలోని
కొన్ని భాగాలు

## సద్గురువు



గురుపూర్ణిమ: సద్గురువు నీకొకసారి లభించాక, నీ బాధ్యత ఆయన స్వీకరించారని తెలిసాక నీకు కష్టాలెదురైనా ఆయన వున్నారనే భావన నీకు అభయాన్నిస్తుంది. అందువలన నీలోని తపన, నీవు పడే బాధ పూర్వంవలె అనుభవంకాక నీ అనుభవంలో మార్పు వస్తుంది. నీ కోరికలు, సంతోషవిషాదానుభూతులలో మార్పు కన్పిస్తుంది. సద్గురువు(అనే) యొక్క ఆ అభయం లభించేదాకా కోరికలు పెరుగుతూ నిన్ను అనంతంగా బాధిస్తాయి. ఆయన లభించిన తర్వాత నీ కోరికల స్వరూపమే మారిపోతుంది. నీకు కోరికలు ఉంటాయి కానీ అవి ఆయన ద్వారా తీరుతుంటాయి. సమయమాసన్నమయినప్పుడు ఆ కోరికలు నీ ప్రేమను వ్యక్తీకరించేవిగా రూపుదిద్దుకుంటాయి.

గురుపూర్ణిమ: సద్గురువు ఒక మంచి అధ్యాపకునిలాగా నీలో ఎదగాలనే తపనని, ప్రేమను పెంచుకోవాలనే కోరికను, విమర్శనాసామర్థ్యాన్ని పెంపొందించి, నీలో పరిణతిని తెచ్చి నీవు జీవితం యొక్క అర్థాన్ని తెలుసుకొనేలా చేస్తారు. మంచి అధ్యాపకుడెవరైనా బిడ్డకు విషయం అవగతం కాకపోతే నిరుత్సాహపరచరు. ఆమె చిన్న పిల్ల. చిన్నపిల్ల తను పెద్దదాన్నయినానని అనుకొంటే ఇంక అధ్యాపకుని ఉపయోగమేమిటి? అధ్యాపకుడు చిన్న బిడ్డకు, ఆ బిడ్డకున్న పరిమితులను దృష్టిలో ఉంచుకొని బోధిస్తాడు. ఆయన ఎప్పుడూ నిరాశ చెందడు. ఆయన చాలా ఓర్పుకలవాడు.

ఏ సద్గురువూ ఐహిక ప్రపంచం పట్ల విరక్తి కలిగి ఉండమనరు. పైగా ఆయన నీలో నెమ్మదిగా వ్యక్తిత్వవికాసం కలిగేలా, ఎదగాలనే తపన పెరిగి ఇంకా ఇంకా ఎదిగి పరిపూర్ణ వ్యక్తిగా మారేలాగా ప్రబోధం చేస్తారు. ఆ తర్వాత నీవు నీ బొమ్మలను వదిలివేసి నిజమైన మనుషులతో మెలగడం మొదలుపెడతావు.

మనం మొగ్గకున్న రెక్కలను విడదీసి పువ్వును వికసింపజేయలేము. మొగ్గ పూవులాగా మారడానికి అవసరమైన ఎరువు, నీరు, వెలుతురు మొదలైన వాటిని దానికందజేస్తాము. సద్గురువు చేసేది కూడా నీకు అనుకూల పరిస్థితులను కల్పించడమే. కొంత బోధచేసి కొన్ని అలౌకిక అనుభవాలను ప్రసాదిస్తారు. మంచినేల, ఎరువు, మంచినీరు, గాలి, వెలుతురు, రక్షణకు సత్సంగమనే కంచె ఏర్పరచి మొగ్గ పువ్వు అయ్యేలా చూస్తారు. ఆయన రేకులు విచ్చుకునేందుకు మొగ్గను తాకి రేకులను విడదీయరు. రాత్రికి రాత్రే మొగ్గ పూవులా మారాలనుకోరు. అంటే మొగ్గని సహజంగా తగినంత సమయం తీసుకొని పెరిగి పెద్దదై సరైన సమయానికి పువ్వులా మారేలా తనదైన శైలిలో చేయడం ఆయన పద్ధతి.

గురువుగారు: వేమన యోగి, "ఇహము లేదు పరము కలదనువాడిమాట కల్లమాట" అని ఒక పద్యంలో అంటారు. ఎవరైనా సరే, 'ఇహము అనేదంతా అశాశ్వతమైనది. మీరదంతా వదిలేయండి. ఆ పరమైనటువంటి పరబ్రహ్మస్వరూపాన్ని ఎప్పుడూ ధ్యానించి దాన్ని పొందండి' అన్నాడా! వాడు దొంగ. వాడి మాట కల్ల – అంటే అబద్ధం అన్న మాట. వాడికి ఏమీ చేతకాక ఏమీ చేయలేక వాడి అసమర్థతను కప్పిపుచ్చడానికి చెప్పేమాట అది. సమర్థ సద్గురువెప్పుడూ ఆ మాట అనరు. ఇహములోనే పరము చూపేవాడే సద్గురువు. ఆ స్థితిని – దానిని భావాతీతస్థితి అని నీవనుకుంటే – ఆ స్థితిని ఇక్కడికి నీకోసం తెచ్చి నీకు ఇచ్చినవాడే నిజమైన సద్గురువు. నీవు సంసార బంధాలను, అన్ని వాంఛలను, ప్రపంచాన్ని వదిలి పైమెట్టు మీదవున్న నాదగ్గరకు వస్తే ఆ బ్రహ్మానందాన్ని నీకు ప్రసాదిస్తానని ఎవరైనా అంటే ఇక ఆయన ఇచ్చేదేమిటి?

సాంసారిక బంధాలను త్యజించలేని, నిచ్చెన ఎక్కిపైకి వెళ్ళలేని మనం ఈ ఐహిక ప్రపంచంలో వున్నాము. ఇక ఆయన కోసం పైకి ఎలా వెళ్ళగలం? ఆయనే మన చెంతకు స్కందాశ్రమం నుండి గిరి పాదం వద్దకు దిగివచ్చి ఆ స్థితిని మనకు ప్రసాదించాలి – ఈ జగత్తులో ఎక్కడ వుంటే అక్కడకు వచ్చి – మన వాంఛలన్నీ నిర్మూలనం చేసుకోగలిగి ఆయనంత ఎత్తుకు మనం చేరుకోగలిగితే ఇక ఆయన అవసరమేముంది? మన కృషిని గురించిగానీ, మనం జపధ్యానాదులు చేస్తున్న తీరు గురించీ మరోదాన్ని గురించిగానీ పట్టించుకోక మన దగ్గరకు దిగివచ్చి ఇక్కడే మనల్ని బంధవిముక్తుల్ని చేసేవాడే నిజమైన సద్గురువు. ఏ షరతులకు లోబడని ఆయన కృప మన మీద వర్షిస్తూ ఉంటుంది. తండ్రి తన బిడ్డనెలా ప్రేమిస్తాడో అలాగే సద్గురువు ఆయనకు, మనకు వున్న సంబంధాన్ననుసరించి మనలను ప్రేమిస్తాడు. ఏ తండ్రైనా తన బిడ్డను ప్రేమించే ముందు బిడ్డ అర్హతలను చూస్తాడా? అయినా బిడ్డకు కావలసిన అర్హతలేమిటి? ఆ తండ్రికి పుట్టడం మాత్రమే – ఆ ఋణానుబంధమే! ఆ బిడ్డ మంచివాడా, చెడ్డవాడా అని చూడడు. ప్రేమిస్తాడంతే! అలాగే సద్గురువు మనలను ప్రేమిస్తారు. మనమందరం ఆయన బిడ్డలం. ఖచ్చితంగా ఏ విషయంలోనైనా ముందువున్న వారికే ఎంచుకొనే హక్కు వుంటుంది. ఈతండ్రికి పుట్టాలని నేనితనిని ఎన్నుకొన్నానని ఎవరైనా అంటారా? లేదు – అది మన సంకల్పం కాదు. అది ఆయన (బాబా) సంకల్పం. అందుకే బాబా నిర్ద్వంద్వంగా, "నా భక్తులను నేనే ఎన్నుకొంటాను" అన్నారు.

సద్గురువు తమ భక్తులను తామే ఎన్నుకొంటారు. భారతీయ సాంప్రదాయంలో శిష్యుడు గురువు వద్దకు వెళ్ళి తనను స్వీకరించవలసిందిగా ఆయనను ప్రార్థించి ఆయన అనుమతికై వేచివుంటారు. గురువును గుర్తించగలగడం మాటలకందని ఒక ఆకర్షణ, ఒక అనుబంధం, ఒక ఇష్టం. అది మనసుకు మాత్రమే తెలుస్తుంది. మనం ఆయన అనుమతి కోసం పరితపిస్తాము. అప్పుడు నీకు ఆయనతో అనుబంధ మేర్పడకముందే ఆయన నిన్ను ఎన్నుకొన్నారనీ, ఆయన ఎన్నుకొన్న తర్వాతే నీవాయనను వెతికి కనుగొన్నావనీ అర్థమవుతుంది.

గురువుగారు: బాబా ఎవరు? బాబా అంటే ఏమిటి? ఆయనను మనం ఎలా అర్థం చేసుకోగలం? అనేది ప్రశ్న. ఆయన కంటికి రెప్పలా సదా మనలను రక్షిస్తుంటారు. కావలివానిలా ఎల్లవేళలా మనలను కనిపెట్టుకుని వుంటారు. ఎంతో ఆతురతతో మనం ఎప్పుడు మన వ్యక్తిత్వపరిమితులనుండి బయటపడి ఆయన ఇవ్వదలుచుకున్నదాన్ని ఎప్పుడు అడుగుతామా అని ఎదురుచూస్తుంటారు. ఎప్పుడెప్పుడు వీళ్ళు నన్ను అడుగుతారా(ఆయన ఇవ్వదలుచుకొన్నది) అని ఆశతో నిరంతరం నిరీక్షిస్తారాయన. అదీ – సాయిబాబా అంటే. అంతులేని సహనశీలి. ఆయన మనలను సబూరీ అడుగుతారు. మనం ఇవ్వము కనుక ఆయనే మనకు సబూరీనిస్తారు. అదీ సబూరీ అంటే. (గురువుగారు నవ్వుతూ) మనమివ్వలేనప్పుడు ఆయనైనా ఇవ్వాలికదా మరి. ఆయన ఇచ్చి మళ్ళీ "ఇవ్వు, ఇవ్వు – కనీసం ఒక్క వాసననైనా వదిలిపెట్టు" అని మరలా పుచ్చుకుంటారు. ఆయన సహనం, పట్టుదల కలవారు. మనమేం చేసినా సహనం పట్టుదలతో వేచి చూస్తుంటారు. అనుకున్నది సాధిస్తారాయన. అదే సాయిబాబా.

గురువుగారు: "ఎవరైనా నా దగ్గరకు ఋణానుబంధంవల్లనే వస్తారు" అన్నారు బాబా. మనందరికి మధ్యగల ఋణానుబంధా న్ననుసరించి నేను మిమ్మల్ని బాబా నాకిచ్చిన ప్రసాదంగా భావిస్తాను. అంతేకానీ మరేదీకాదు. మీరు పవిత్రంగా చూస్తారో లేదో – అది వేరే విషయంగానీ – నాకు మాత్రం మీరంతా బాబా యిచ్చిన పవిత్రమైన ప్రసాదం. నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావించి స్వీకరిస్తాను. బాబా అందరికీ హితమే చేకూర్చుతారు. బాబా మీకు మంచి చేస్తారు. అప్పుడు మీరు, మీతో పాటు నేను సంతోషిస్తాము.